క్లుప్తంగా

మాగుంట కుటుంబీకులకు పరామర్శ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సరస్వతీనగర్‌లో మాగుంట పార్వతమ్మ, జేకే రెడ్డి కుటుంబీకులను కాంగ్రెస్ పార్టీ నేత కేవీపీ రామచంద్రరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాకుపల్లిలో ‘పొలం పిలుస్తోంది’

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని కాకుపల్లి, మాదరాజుగూడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త మధుసూదన్ మాట్లాడారు. రబీ సీజన్లో వరిని ఆశించే తెగుళ్ల నివారణ చర్యలను తెలియజేశారు. అనంతరం నెల్లూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు మాట్లాడారు. పీఎం కిసాన్‌లో నగదు జమ కాని రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి, ఈ- కేవైసీని చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి నాగమోహన్, వ్యవసాయ సహాయకులు అభిలాష్, ధర్మతేజ, కెనరా బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోఆర్డినేటర్ రవిశంకర్, మార్కెటింగ్ సూపర్‌వైజర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వైమానిక దళ విశ్రాంత ఉద్యోగికి సత్కారం

నెల్లూరు(బృందావనం): దేశ రక్షణలో వైమానిక దళం కీలకపాత్ర పోషిస్తోందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళ దినోత్సవాన్ని పురమందిర సమీపంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 1971 యుద్ధంలో పాల్గొన్న నెల్లూరుకు చెందిన వైమానిక దళ విశ్రాంత ఉద్యోగి కామసాని కృష్ణారెడ్డిని సత్కరించారు. ఆయుర్వేద వైద్యులు బొనిగి ఆనందయ్య, డాక్టర్ శ్యామ్‌ధన్, అందె శ్రీనివాసులు, గంటా వెంకటరవికుమార్, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సేవలు అభినందనీయం

నెల్లూరు(అర్బన్): వ్యాధులను గుర్తించడం, రోగుల చికిత్సకు సహాయపడటంలో ఆశ కార్యకర్తలు సేవలు ఎనలేనివని ఏడీఎంహెచ్ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని రామచంద్రాపురం, రైతు బజార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు అల్లీపురం, జగదేవిపేట, మైపాడు గ్రామాల్లోని పీహెచ్‌సీలను ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. టీబీ, లెప్రసీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని ఆశ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్షించారు. రిస్క్ ఎక్కువగా ఉన్న వయోజనులకు టీబీ నివారణ వ్యాక్సినేషన్ ప్రక్రియను నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నెల్లూరు సిటీ: వృద్ధులను బాధ్యతగా చూడాలని హెల్పేజ్ ఇండియా రాష్ట్ర ఇన్‌చార్జి లంకపల్లి మృణాల్ పేర్కొన్నారు. కొత్తూరులోని నెహ్రూ భారతి.. ఆమంచర్లలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిత్యావసరాలను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన మొదటి జీతంతో నాలుగు ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పంపిణీ చేయడాన్ని అభినందించారు. పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ నేతలు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ రిహానా తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పల్లకిసేవ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని గోపురంవీధిలో గల వేదాంత దేశికర్ దేవస్థానంలో ఆదివన్ శఠగోపస్వామి తిరునక్షత్ర మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. తొలుత శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ.. శఠగోపస్వామికి శ్వేతఛత్రాలతో పల్లకిసేవ, తిరుమంజనం, శాత్తుమొరైను జరిపారు. దేవస్థాన మేనేజింగ్ ట్రస్టీ వరదరాజన్, బాలాజీ, రమేష్, రాజగోపాల్, నరసింహన్, కల్యాణసుందరం తదితరులు పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

నెల్లూరు రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. వివిధ విద్యార్థి సంఘాల్లో పనిచేసిన పలువురు నేతలు తమ సంఘంలో చేరుతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా తమ సంఘం పనిచేస్తుందని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, సుకుమార్, సంతోష్, సిసింద్రీ, సోను, శివశంకర్, అశ్విన్, చిన్ని పాల్గొన్నారు.



కాళికాదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో..



మూలస్థానేశ్వరాలయంలో..



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



మహాలక్ష్మి దేవస్థానంలో..



సీతారామస్వామి మందిరంలో..

జగన్మాతా.. కరుణించమ్మా

నెల్లూరు(బృందావనం): సింహపురిలో శరన్నవరాత్రి మహోత్సవాలను శోభాయమానంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు వివిధ అలంకారాల్లో కొలువుదీరారు. అశేష భక్తజనం ఆలయాలకు విచ్చేసి జగన్మాతను దర్శించుకుంటున్నారు.

- నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు కాళికా అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చెన్నారెడ్డి శిరీష, సతీష్‌కుమార్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, శ్రీలత, నిరంజన్‌రెడ్డి, ప్రవీణ వ్యవహరించారు.
- సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కిరణ్‌కుమార్, లలితారాణి, ప్రతాప్‌రెడ్డి, సుమన, సురేష్‌బాబు, సుభాషిణి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా విజయానంద్, శ్రీదేవి దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని ద్రౌపతీదేవి సమేత కృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ప్రత్యూష దంపతులు వ్యవహరించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. మూలవర్లను రూ.6.6 లక్షల నాణేలతో అలంకరించారు. ఉభయకర్తలుగా అనుమాలశెట్టి హరగోపాల్, శైలజకుమారి, పెసల నాగేశ్వరరావు, సుభాషిణి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్, సుభాషిణి దంపతులు, చంద్రశేఖర్‌గుప్తా వ్యవహరించారు.
- కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మిగా లక్ష గాజులతో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బాబు, శేషమ్మ, వేణు, సుష్మ, రామకృష్ణ, కల్యాణి, రమణారెడ్డి, రాజేశ్వరి, రమేష్‌నాయుడు, శ్రీలక్ష్మి దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ధనుంజయరెడ్డి, సంపూర్ణ దంపతులు వ్యవహరించారు
- విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గురుస్వామి, రత్నమ్మ, నరసింహ, సుజాత, సూర్యప్రకాష్, సావిత్రి దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో గల వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా నరసింహయాదవ్, పద్మ దంపతులు, మల్లీశ్వరి వ్యవహరించారు.
- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శేషారెడ్డి, ప్రమీల దంపతులు వ్యవహరించారు.
- నవాబుపేటలోని కామిశెట్టి మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా రాంబాబు, రమాదేవి దంపతులు వ్యవహరించారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు విజయలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కృష్ణచైతన్యరెడ్డి, గాయత్రి, విద్యాసాగర్‌రెడ్డి, భవాని దంపతులు వ్యవహరించారు.
- సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా లక్ష్మీనారాయణ వ్యవహరించారు.
- సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు కాళి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మురళీకృష్ణ, పార్థసారథిగుప్తా, అరుణ దంపతులు వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, జగన్నాథం, విజయకుమార్ తదితరులు వ్యవహరించారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. విశేష పూజలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మి వ్యవహరించారు. ఈఓ వేమూరి గోపీ, అర్చకుడు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గరుడసేవను నిర్వహించారు. కోలాట ప్రదర్శనను కళానికేతన్ కోలాట బృంద ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా మాకిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమామహేశ్వరి, కత్తి ఏడుకొండలు, సరస్వతి దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ దొరసాల నాగిరెడ్డి, ప్రధానార్చకుడు సాయిభరద్వాజ పర్యవేక్షించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..



కామిశెట్టి వారి మహాలక్ష్మి ఆలయంలో..



వైభవలక్ష్మి ఆలయంలో..



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..



మల్లేశ్వరస్వామి దేవస్థానంలో..



గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో..



వేదగిరిలో..



వెంకటేశ్వరపురంలో..

నిర్లక్ష్యానికి పరాకాష్ట





వీధుల్లో పేరుకుపోయిన చెత్త

- చెత్త తొలగింపులో లోపించిన చిత్తశుద్ధి
- వీధులను నిత్యం శుభ్రం చేయడంలో అలసత్వం
- మరమ్మతులకు గురైన వాహనాల స్థానంలో ట్రాక్టర్ల ఏర్పాటు
- ఫలితంగా ఎక్కడ చూసినా అపరిశుభ్రతే

నెల్లూరు(బారకాసు): నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ చెప్తున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చెత్తను సేకరించేందుకు మినీ వ్యాన్లను ఏర్పాటు చేసి తద్వారా ఇంటింటి చెత్తను సేకరించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో చెత్త సేకరణలో ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అధిక భాగం మరమ్మతులకు గురై..

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 54 డివిజన్లు ఉండగా, దాదాపు తొమ్మిది లక్షల మంది నివసిస్తున్నారు. 149.89 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన నగరంలో 1.84 లక్షల గృహాలున్నాయి. నగరంలో చెత్త సేకరణకు గానూ 146 మినీ వాహనాలుండేవి. అయితే ఇందులో సింహభాగం ప్రస్తుతం మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్లను కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ డివిజన్‌కో ట్రాక్టర్ చొప్పున 54 ట్రాక్టర్లను ఏర్పాటు చేశారు. అయితే ట్రాక్టర్లు చిన్న వీధుల్లోకి ప్రవేశించలేని కారణంగా ప్రధాన రహదారులు, పెద్ద వీధుల్లో చెత్త సేకరణకే పరిమితమవుతున్నాయి. చిన్న వీధుల్లోని వారు తమ ఇంటి చెత్తను ఎక్కడ వేయాలో అర్థంకాక రోడ్లపై పడేస్తున్నారు. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

కానరాని పారిశుధ్య కార్మికులు

కార్పొరేషన్ పరిధిలో 1500 మంది పారిశుధ్య కార్మికులున్నారు. వీరిలో 1237 మంది అవుట్‌సోర్సింగ్ కాగా.. 263 మంది రెగ్యులర్‌గా ఉన్నారు. అయితే వీరిలో కొందరే ప్రధాన రహదారులు, పెద్ద వీధులను శుభ్రం చేస్తున్నారు. మిగిలిన వారు చిన్న వీధుల్లో పని చేస్తున్నారని చెప్తున్నా, కానరావడంలేదు.



చెత్తను తొలగించేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్

నో అనౌన్స్‌మెంట్

చెత్త తరలించే వాహనాలు గతంలో వీధుల్లోకి వచ్చిన సమయాల్లో అనౌన్స్‌మెంట్ ఇచ్చేవారు. దీంతో చెత్తను అందులో ప్రజలు వేయగలిగేవారు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియే అమలు కావడం లేదు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, లేని పక్షంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

అక్రమాలకు కేరాఫ్ సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఏడుకొండలు

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన నెలకే అవినీతి, అక్రమాలకు పాల్పడటాన్ని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపాల ఏడుకొండలు ఆరోపించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సాక్ష్యాధారాలతో సహా ప్రజలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలియజేస్తూనే ఉన్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇసుక, మట్టి, ఫ్లయ్‌యాష్‌ను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్న మాట వాస్తవం కాదానని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమానని సోమిరెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పంటపాళెంలోని ఆయిల్ ఫ్యాక్టరీల్లో మాఫియా జరుగుతోందని ఆరోపించారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారానని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఎస్సీ సెల్ నేతలు మందాకృష్ణ, నరసయ్య, మనోజ్, శివ, సుబ్బరాయుడు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్లాట నిర్వాహకుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ముత్తుకూరు గేట్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సింగిల్ నంబర్లాటపై దాడులను ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. సింగిల్ నంబర్లాట నిర్వహిస్తున్న సందీప్, చిరంజీవి, వెంకటేష్, తేజను అరెస్ట్ చేసి, వీరి నుంచి రూ.3500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాలను నెల్లూరు ఒకటో, రెండో డిపోల పరిధిలో బుధవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని మేనేజర్లు శివకేశవ్‌యాదవ్, మురళీకృష్ణ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను తెలియజేయాలని కోరారు. డిపో – 1కు సంబంధించి 99592 25641.. డిపో – 2కు గానూ 99592 25642 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈఈకి అభినందన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్లో కన్‌స్ట్రక్షన్స్ విభాగంలో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న తలమాల శ్రీధర్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలోని ఐటీ విభాగ ఈఈగా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు అభినందనలను మంగళవారం తెలియజేశారు. ఈఈలు శేషాద్రి బాలచంద్ర, జగదీష్, శ్రీధర్, జనార్దన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, డీఈఈ అశోక్, సీనియర్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు మద్దతివ్వొద్దు

నెల్లూరు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతును ఉపసంహరిస్తున్నట్లు టీడీపీ ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, ఆవాజ్ వ్యవస్థాపక నేత గఫూర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణలు - పరిణామాలు అనే అంశంపై హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సదస్సును ఆవాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఇలా ఓ వర్గాన్ని లక్ష్యం చేసుకోవడం దుర్మార్గమని చెప్పారు. ఈ చట్టానికి మద్దతిచ్చే ప్రసక్తేలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తేల్చిచెప్పిందని, అయితే మైనార్టీలకు ద్రోహం చేస్తూ ఈ చట్ట సవరణలకు టీడీపీ కూటమి ప్రభుత్వం మద్దతివ్వడం సిగ్గుచేటని విమర్శించారు. ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ

నెల్లూరు(క్రైమ్): ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా పేర్కొన్నారు. నేర నియంత్రణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు, వివిధ చట్టాలు తదితరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని భగత్‌సింగ్ కాలనీలో మంగళవారం రాత్రి నిర్వహించారు. వార్డు నిద్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌తో చోరీలను కట్టడి చేయొచ్చని చెప్పారు.

చులకనగా మాట్లాడటం తగదు

నెల్లూరు(బారకాసు): గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులపై చులకన తగదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. ఆచారివీధిలోని నెల్లూరు జర్నలిస్ట్ భవన్‌లో పలువురు కార్యదర్శులతో కలిసి విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులపై విజయనగరం కమిషనర్ నల్లనయ్య అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చైతన్య, ఈసీ మెంబర్లు పాండురంగ, బాలరాజు, దారా సురేష్‌బాబు, లక్ష్మి, రమేష్, మల్లికార్జున, ఖాలిద్ తదిత రులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా వేడుకలు

నెల్లూరు(బృందావనం): దసరాను పురస్కరించుకొని మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో వేడుకలను బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నామని సమాజ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలకు భారీగా తరలిరావాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి కృషి

నెల్లూరు రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ కూటమి కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ అన్నారు. నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా టీటీడీకి రాదని.. ఇంకా టీటీడీ నుంచే కోట్ల రూపాయలు ప్రభుత్వానికి వెళ్తాయన్నారు. సమావేశంలో నేతలు రాజేష్ ప్రవీణ్‌కుమార్, ముక్కు రాధాకృష్ణ, గిరికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పురసేవల అధ్యయనంలో కమిషనర్

నెల్లూరు(బారకాసు): ఇతర రాష్ట్రాల్లో పురపాలక సేవలను అధ్యయనం చేసి మెరుగైన సేవలను అందించే విషయంలో నివేదిక రూపొందించేందుకు గానూ కమిషనర్ల బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ బృందంలో సభ్యుడిగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఆదర్శ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలను కమిషనర్ సూర్యతేజ సందర్శించనున్నారు. వివిధ అంశాలపై ఐదు రోజుల పాటు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు.